లయన్స్ క్లబ్ వార్షిక సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్ వార్షిక సదస్సును సోమవారం సికింద్రాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ డిస్ట్రిక్ట్ 320హెచ్ గవర్నర్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరంలో 5 వేల మంది విద్యార్థులకు లయన్స్ క్వెస్ట్ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. అలాగే 5 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2,100 మంది లయన్స్ సభ్యులతో సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని అవగాహన కార్యక్రమాలు చేపడుతామని దీనికోసం ప్రత్యేకంగా 50 మందితో కూడిన బృందాన్ని సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సనత్‌నగర్: సామాజిక బాధ్యతలో భాగంగా బేగంపేటలోని సత్యం వెంచర్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (సట్విన్) వేసవిని దృష్టిలో పెట్టుకుని బేగంపేట ప్రధాన రహదారిలోని అశోక భూపాల్ చాంబర్స్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సట్విన్ సీఈఓ వడ్లమూడి శ్రీనివాసరావు, బేగంపేట ట్రాఫిక్ ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బౌద్ధనగర్: వర్షంతో రోడ్లన్నీ బురదమయంగా మారిన పట్టించుకోవడం లేదని ఎల్‌నారాయణ నగర్, న్యూ అశోక్‌నగర్ బస్తీవాసులు బౌద్ధనగర్‌లోని వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ కంది శైలజను కోరారు. వెంటనే స్పందించిన ఆమె ఇంజినీరింగ్ అధికారులు, ప్రజలతో కలిసి బస్తీలో పర్యటించారు. నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడం లేదని, రోడ్లపై పేరుకుపోయిన బురద రోజుల తరబడి అలాగే ఉందని కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. నాలాను విస్తరించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఎమ్మెల్యే పద్మారావు, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ప్రస్తుతం నాలాలోని చెత్తను, రోడ్ల మీద బురదను తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ తిరుపతిరావు, ఏఈ లావణ్య, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాలకు రండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.కుమార్ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఓయూలో ఈనెల 10 నుంచి 13 వరకు నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వీసీ తెలిపారు. అలాగే వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో వీసీ కృతజ్ఞతలు తెలిపారు.

రోగి సహాయకుడి అదృశ్యం


రవీందర్

గాంధీఆస్పత్రి: రోగి సహాయకుడు అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్టకు చెందిన నారాయణ గుండె సంబంధిత రుగ్మతలతో గత నెల 27న చికిత్స కోసం గాంధీ ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు సర్జరీ చేయగా కోలుకుంటున్నాడు. నారాయణకు సహాయకుడిగా కుమారుడు రవీందర్ ఉంటున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన రవీందర్ వారం పాటు మద్యం తాగకపోవడంతో మానసిక రుగ్మతలకు గురయ్యాడు. ఈనెల 5న బయటకు వెళ్లిన రవీందర్ తిరిగి ఆస్పత్రికి చేరలేదు. దీంతో పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు


నిందితుడు శివ

కంటోన్మెంట్: హత్య కేసు నిందితుడికి సికింద్రాబాద్ ఆరో అదనపు సెషన్స్ జడ్జి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. బోయిన్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి పెద్ద తోకట్టా వాసి కె. శివ (33), స్వప్న అనే మహిళతో ప్రేమలో ఉన్నాడు. అయితే వీరి ప్రేమను అంగీకరించని స్వప్న తల్లిదండ్రులు ఆమెకు రాజేశ్ అనే వ్యక్తితో వివాహం చేశారు. అయినప్పటికీ శివ–స్వప్న వారి సంబంధాన్ని కొనసాగిస్తూ వచ్చారు. శివ, స్వప్నను ఆమె తల్లిదండ్రుల ఇంటి నుంచి తీసుకెళ్లి హస్మత్‌పేటలో సహజీవనం సాగిస్తూ వచ్చారు. తర్వాత శివ, స్వప్న మధ్య విబేధాలు వచ్చాయి. ఈ క్రమంలో 2023 డిసెంబర్ 23న శివ మద్యం తాగి, గదిలో నిద్రిస్తున్న స్వప్నపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. పొరుగు వారి సాయంతో ఆసుపత్రిలో చేరిన స్వప్న, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ కేసు విచారణ ఇటీవలే ముగియగా, నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

మేము మారం..!

నార్త్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లం'ఘను'లు

3 నెలల్లోనే 26,448 కేసుల నమోదు

- పెరుగుతున్న రాంగ్‌రూట్ డ్రైవింగ్..
- కౌన్సెలింగ్ ఇస్తున్నా యువతలో మార్పురానీ వైనం


రాంగ్ రూట్ డ్రైవ్ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులు

సనత్‌నగర్: రాంగ్‌రూట్ డ్రైవింగ్..ఆ వాహనదారుడికే కాదు..ఎదురుగా వచ్చేవారికి కూడా హానికరమే. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబాల శోకం తీరనిది. రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై నిత్యం తనిఖీలు చేస్తూ వారికి కౌన్సెలింగ్ ఇస్తోన్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టే సమయంలో నిబంధనలు పాటిస్తున్నా వాహనదారులు ట్రాఫిక్ పోలీసులు లేకుంటే రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేసి పట్టుబడుతున్నారు. వారిలో ఎక్కువ శాతం యువతతో పాటు పెద్దలు అందులోనూ విద్యావంతులే ఎక్కువగా ఉండడం గమనార్హం. చదువుకున్న వారే నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇతరుల ప్రాణాల మీదకు తీసుకువస్తున్నారంటూ ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు. నివేదికల ప్రకారం రాంగ్‌రూట్ డ్రైవింగ్ వల్లనే అనేక ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నార్త్‌జోన్ ట్రాఫిక్ పరిధిలోని బేగంపేట, మహంకాళి, గోపాలపురం, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్లలో గడిచిన 3 నెలల్లో 26,448 కేసులు ఒక్క రాంగ్‌రూట్ డ్రైవింగ్ వల్లే నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. వీటిలో అత్యధికంగా బోయిన్‌పల్లిలో 11,046 కేసులు, తిరుమలగిరిలో 6,114, బేగంపేటలో 3,975 రాంగ్‌సైడ్ కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా విధించారు.

పోలీస్‌స్టేషన్ల వారీగా రాంగ్‌రూట్ డ్రైవింగ్ కేసులు

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	రాంగ్‌సైడ్ డ్రైవింగ్ కేసులు
బేగంపేట	3975
మహంకాళి	2535
గోపాలపురం	473
మారేడ్‌పల్లి	2305
తిరుమలగిరి	6114
బోయిన్‌పల్లి	11,046

యూటర్న్ దూరంతో.. రాంగ్‌రూట్‌లో వెళ్తూ..

వాహనదారులు యూటర్న్‌లతో పాటు జంక్షన్ల వరకు వెళ్లి తిరిగి వెనక్కి రావాలంటే అనాసక్తి కనబరుస్తున్నారు. అలాకాకుండా రివర్స్‌లో వెళ్తే తొందరగా వెళ్లిపోవచ్చనే ధోరణి పెరిగిపోతోంది. ఉదయం వేళల్లో స్కూల్, కాలేజీలు, ఆఫీసు సమయం అయిపోతుందనే ఆతృతలో ఎక్కువ మంది రివర్స్‌లో వెళ్తున్నట్లు పోలీసుల తనిఖీల్లో స్పష్టమవుతోంది. ఈ క్రమంలోనే చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే క్రమంలో వెనుక వచ్చే వాహనదారులు కూడా వీరి బారిన పడుతున్నారు. ఒక్కరు చేసిన తప్పు మరిన్ని కుటుంబాలు మూల్యాన్ని చెల్లించుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. క్షతగాత్రులుగా, లేక ప్రాణనష్టం, లేక వాహనాలు ధ్వంసమై ఆస్తి నష్టం సంభవించడమో జరుగుతున్నాయి. రాంగ్‌రూట్ లో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదం జరిగితే నిందితుడిగా మారడంతో పాటు ఒకవేళ చనిపోతే బీమా డబ్బులు కూడా బాధిత కుటుంబ సభ్యులకు రావు. నిత్యం యూటర్న్‌ల వద్ద రివర్స్‌లో వాహనదారులు వస్తుండడాన్ని గుర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులు రెగ్యులర్‌గా డ్రైవ్‌లు చేపడుతూనే ఉన్నారు. ఉల్లం'ఘను'లపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో న్యాయమూర్తి ఆదేశాల మేరకు జరిమానాలు లేదా జైలుకు పంపిస్తున్నారు.

రాంగ్‌రూట్ డ్రైవింగ్ ప్రమాదకరం

టైం అయిపోతోందన్న తొందరలో చాలామంది నిబంధనలు ఉల్లంఘిస్తూ రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేస్తున్నారు. దీనివల్ల ఎదురుగా వచ్చే వాహనదారులతో పాటు పాదచారులకు ఇబ్బందికరంగా మారుతోంది. రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధం. ఏదైనా ప్రమాదం జరిగితే రాంగ్‌రూట్‌లో వచ్చిన వారు నిందితులుగా శిక్ష అనుభవించక తప్పదు. ట్రాఫిక్ నిబంధనలు పాటిసేత తమతో పాటు ఎదుటి వారు కూడా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతారు.
– నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

ఘనంగా ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ జన్మదిన వేడుకలు


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ


వారాసీగూడలో వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు సుమిత్‌యాదవ్

సికింద్రాబాద్: నియోజకవర్గవ్యాప్తంగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, యువత, మహిళా, విద్యార్థి, కార్మిక వంటి అనుబంధ విభాగాల నేతలు పలు ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్లు సామల హేమ, బీఆర్‌ఎస్ నాయకులు బోళ్ల సుమిత్‌యాదవ్, జీ.చంద్రశేఖర్ సీతాఫల్‌మండి, వారాసీగూడలో అన్నదానాలు చేపట్టారు. మెట్టుగూడ, సీతాఫల్‌మండి డివిజన్లలోని అనాథ శ్రమాల్లో పండ్ల పంపిణీ, మొక్కలు నాటడం, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అడ్డగుట్ట కార్పొరేటర్ ఆధ్వర్యంలో..

అడ్డగుట్ట: అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాంతినగర్‌లోని క్యాప్ బౌల్ అనాథశ్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం వారితో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, అమర్, ఎల్లయ్య, వసంత, మహమ్మద్, నర్సింగ్, బాలరాజు, దేవయ్య, అల్లా బక్ష్, సంతోష్, రామస్వామి, శ్రీరాములు, శివకుమార్, రామప్ప, ప్రవీణ్, శంకర్, రమా, చిన్న రజిత, మహేశ్వరి, వెంకటలక్ష్మి, శారద పాల్గొన్నారు.

బౌద్ధనగర్ డివిజన్‌లో..

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్ కంది శైలజ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వార్డు ఆఫీస్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బెజ్జంకి రాజేశ్, పాక సాయి, ముజఫర్, జానకీరాం, సుజాత, మానస, గీత, మంజు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

'దళిత, రాజ్యాంగ వ్యతిరేకి బీజేపీ'


ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

కంటోన్మెంట్: దళిత, రాజ్యాంగ వ్యతిరేక పార్టీ బీజేపీ అని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'జై బాపు–జై భీమ్–జై సంవిధాన్ అభియాన్' ర్యాలీని కంటోన్మెంట్ నాలుగో వార్డులో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నినాదాలతో ప్రజలను మభ్యపెడుతూ జనాలను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తున్నదని ఆరోపించారు. ఆ పార్టీ దళిత, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపర్చడమే ర్యాలీ ఉద్దేశం అని అన్నారు. మరోవైపు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ కంటోన్మెంట్‌లో బోర్డు ఎన్నికలు నిర్వహించకుండా ఐదేళ్లకు పైగా కేంద్ర ప్రభుత్వం నామినేటెడ్ సభ్యులతో పరిపాలన సాగిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. పాదయాత్రలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కంటోన్మెంట్ కోఆర్డినేటర్, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం


సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో శ్రీరాముడికి పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు

సనత్‌నగర్: హనుమాన్ ఆలయం (సెవన్ టెంపుల్స్)లో శ్రీరాముడి పట్టాభిషేక మహోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ నాయుడు నేతృత్వంలో ప్రధాన అర్చకుడు రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో పట్టాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు జరిగాయి. నదీ జలాలతో స్వామివారికి సంప్రోక్షించి పట్టాభిషిక్తుడిని చేశారు. అలాగే కళావేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శాంతినగర్ రామాలయంలో..

లాలాపేట: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శాంతినగర్‌లోని రామాలయంలో సోమవారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు సీతారాములకు ఉయ్యాల సేవ, రథోత్సవం, తదితర పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు నేతి రాములు గుప్తా, అధ్యక్షుడు పంచముఖి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి యెడ్ల రామారావు, వెంకటేశం, భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాంగోపాల్‌పేట్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమా అన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని పలువురు మహిళా నేతలు సోమవారం ఆమెను కలిసి పలు సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జయశీల, రేష్మా, సరిత, జ్యోతి, నిర్మల, శశికళ తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూములు ఆక్రమిస్తే చర్యలు

లాలాపేట: చెరువు భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని మారేడుపల్లి తహసీల్దార్ భూమయ్య హెచ్చరించారు. తార్నాక ఎర్రకుంట చెరువు భూముల్లో ఇటీవల ఓ వ్యక్తి సిమెంట్ దిమ్మెలతో రెడీమెడ్ ప్రహరీ నిర్మాణానికి యత్నించారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుతో స్పందించి అధికారుల ఆదేశాల మేరకు సోమవారం రెవెన్యూ సిబ్బంది వచ్చి సిమెంట్ దిమ్మెలు, కడ్డీలను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. చెరువు భూములు వివాదంలో ఉన్నాయని దీంతో పాటుగా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. చెరువు భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దని సూచించారు.

ఆటిజంపై తల్లిదండ్రులకు అవగాహన ఉండాలి

రసూల్‌పురా: మానసిక ఎదుగుదల లోపం కారణంగా ఏర్పడే అరుదైన సమస్య ఆటిజంపై తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని స్వీకార్ ఉపకార్ రిహాబిలిటేషన్ సంస్థ ఉపాధ్యక్షురాలు డాక్టర్ నిర్మల హన్మంతరావు సూచించారు. సోమవారం ప్రపంచ ఆటిజం వారోత్సవాల ముగింపు సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన నడక కార్యక్రమం నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ ఆడియాలజీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ హెల్త్ విద్యార్థులు బ్యాంక్ ఆఫ్ అమెరికా ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ జేబీఎస్ నుంచి ప్యాట్నీ, ప్యారడైజ్, పరేడ్ గ్రౌండ్ మీదుగా కొనసాగిన నడక తిరిగి సంస్థ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 2 నుంచి 7 వరకు ఆటిజంపై అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ముగింపు సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్ర మంలో సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ, విభాగ అధిపతి డాక్టర్ స్వాతి, జీఎస్‌సి. కుమార్, ధామస్, సబిత, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకోవాలి


విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ముగ్గురు పేద విద్యార్థులకు సనత్‌నగర్‌కు చెందిన సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.2.45 లక్షల ఆర్థిక సహాయాన్ని గిర్కాల శ్రావణి ఎంఎస్ ఫస్టియర్ కోసం రూ.2 లక్షలు, దత్తా, వీరు ఇంటర్ చదువుల కోసం రూ.20 వేలు, రూ.25 వేల చొప్పున చెక్కులను విద్యార్థులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ఫౌండర్ మురళి, అధ్యక్షురాలు మమత, ఉపాధ్యక్షులు ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు పాటుపడాలి

బన్సీలాల్‌పేట్: మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒక్కరూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడాలని పలువురు వక్తలు కోరారు. చాచానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన మూలవాసుల మాసోత్సవం సందర్భంగా సోమవారం భీమరామోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిదాస్ వాగ్మారే, కళానిధి మాస్టర్‌జీ, ఎస్సీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు డి. సుదర్శన్‌బాబు తదితరులు మాట్లాడారు. దళితులు విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా ఎదగాలన్నారు. ఎస్సీఆర్పీ నాయకులు రాగాల నాగేశ్వర్ రావు, కుర్మ మహేందర్, నాయకులు మాచర్ల ప్రభాకర్, కుర్మలక్ష్మీపతి, కేఎం కృష్ణ, వై. సురేశ్‌కుమార్, ఎస్ఆర్ మల్లేశ్, అగ్రిప్ప, రేణుక, డి. శంకర్, స్వర్ణరాజ్, రాపాక అశోక్, సాయిరాం పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకే ప్రమాదాలు

అమీర్‌పేట: వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై సరైన అవగాహన లేకే ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. అమీర్‌పేటలో మైనర్ డ్రైవింగ్‌పై సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన 8 మంది మైనర్లపై కేసు నమోదు చేసి, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ చివరి వరకు ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు. తాత్కాలిక ఆనందం కోసం వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అవడమే కాకుండాగా ఎదుటివారి జీవితాలను సైతం ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నారన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు, యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.


పాత గొడవలతో అడ్వొకేట్‌పై దాడి

చిలకలగూడ: పాత గొడవలతో ఓ అడ్వొకేట్‌పై బంధువు కత్తితో దాడి చేసిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్త్‌లాలాగూడకు చెందిన అడ్వొకేట్ ముస్తఫా అలియాస్ సోహెల్ (28), మహ్మద్ బిలాల్ తౌసిఫ్ అలియాస్ బల్లులు కజిన్స్. ఆస్తుల విషయంలో కొద్దిరోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి 11.30 సమయంలో పద్మారావునగర్‌లోని గణేశ్ జ్యువెలరీ సమీపంలో ఇద్దరూ ఆస్తులు, డబ్బుల విషయంపై రోడ్డుపై గొడవకు దిగారు. దీంతో మహ్మద్ బిలాల్ తౌసిఫ్ కత్తితో ముస్తఫాపై దాడి చేసి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న ఆయనను వెంటనే చిలకలగూడ పోలీసులు చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిమ్స్ సన్‌షైన్‌లో రోబోటిక్ వైద్య సేవలు

ప్రారంభించిన డాక్టర్ గురువారెడ్డి

సనత్‌నగర్: రోబోటిక్ టెక్నాలజీ వల్ల రోగికి మెరుగైన, ఖచ్చితమైన, భద్రతతో కూడిన శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో ఎక్కడా లేనివిధంగా ఆరు రోబోలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి తెలిపారు. నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన రోబోటిక్ దావించి సాయంతో జనరల్ సర్జరీ, గైనకాలజీ, యూరాలజీ, కేన్సర్ శస్త్ర చికిత్సలను నిర్వహించవచ్చని చెప్పారు. బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో అత్యాధునిక శస్త్ర చికిత్స రోబోటిక్ దావించిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నూతనంగా అందుబాటులోకి వచ్చే ఆధునిక వైద్యసేవలను అందిపుచ్చుకుంటున్నట్లు తెలిపారు. హెడ్ ఆఫ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, రోబోటిక్ సర్జన్ డాక్టర్ విమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ రోబో సాయంతో జీఐ, విపుల్, కేన్సర్, జీర్ణ వ్యవస్థకు సంబంధించిన కేన్సర్లు, ప్యాంక్రియాటిక్ పైత్యగొట్టాలు, పెద్ద పేగు కేన్సర్‌లకు శస్త్ర చికిత్స నిర్వహించవచ్చని తెలిపారు. సర్జన్ ఆదేశాల మేరకు రోబో పనిచేస్తుందని తెలిపారు. రోబో సాయంతో నిర్వహించిన ఎరిన్యా శస్త్ర చికిత్స వీడియోను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కార్డియో థోరాసిక్ సర్జన్ డాక్టర్ పీఎస్ రావు, యూరాలజిస్ట్ డాక్టర్ నందకుమార్, డాక్టర్ శ్రీహర్ష, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ పృథ్వీరాజ్, వివిధ విభాగాల వైద్య నిపుణులు పాల్గొన్నారు.


రోబోను ప్రారంభిస్తున్న డాక్టర్ గురువారెడ్డి

నిజాయితీగా విధులు నిర్వర్తించాలి


ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: నిజాయితీగా విధులు నిర్వర్తిస్తే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. సిక్ సిటిజన్ ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్ ఆడిటోరియంలో 2018–25 మధ్య ప్రభుత్వోద్యోగాలు సాధించిన సిక్కు యువతను ఆదివారం సన్మానించారు. ఫోరం వ్యవస్థాపకుడు, కన్వీనర్ ఓంకార్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, రిటైర్డ్ ఐఏఎస్ అర్విందర్‌సింగ్, రిటైర్డ్ ఎస్పీ ప్రీతం సింగ్, బీదర్ గురునానక్ ఇంజినీరింగ్ కాలేజ్ వైస్ చైర్మన్ రేష్మా కౌర్, లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్, వైస్ గవర్నర్లు రాజేంద్రప్రసాద్, సాయి రాంరాజ్, తెలంగాణ గురుద్వారాల అధ్యక్షులు గురుచరణ్ సింగ్ బగ్గా, సెంట్రల్ గురుద్వారా అధ్యక్షులు ఇందర్‌సింగ్, డాక్టర్ నౌనీహాల్ సింగ్ తదితరులు పాల్గొని వారిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సిక్కుల్లో ప్రభుత్వోద్యోగాలు సాధించే వారు చాలా తక్కువ అని 24 మంది గవర్నమెంట్ జాబ్స్ పొందడం ఆనందంగా ఉందన్నారు. గురునానక్ బోధించిన మూడు ప్రధాన సూత్రాలను గుర్తుంచుకుంటూ నీతి, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు హర్బీందర్‌సింగ్, గుర్మీత్‌సింగ్, స్వరణ్‌సింగ్ కల్సా, హర్జీత్‌కౌర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక దృష్టి పెట్టాలి

రాంగోపాల్‌పేట్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖ ధికారి డాక్టర్ వెంకటి సూచించారు. సికింద్రాబాద్‌లోని తన కార్యాలయంలో ఉద్యోగులు, అధికారులతో కలిసి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాంత్రికమైన జీవితంలో మానసిక ఒత్తిళ్లను దూరం చేసుకుని ప్రతిరోజూ వాకింగ్, యోగా చేస్తూ ప్రశాంతమైన వాతావరణంలో విధులు నిర్వహించాలని సూచించారు. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఉద్యోగులందరూ మెరుగైన సేవలు అందించాలన్నారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీస్‌పై సిబ్బంది, వైద్యులు దృష్టి పెట్టి సర్వే చేసి సకాలంలో రోగులను గుర్తించి చికిత్స అందించి నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, డీఐవో డాక్టర్ సాయిబాబా, డాక్టర్ ఆస్రితరెడ్డి, రాములు, అంజయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు


శానిటేషన్ సిబ్బందితో సమీక్షిస్తున్న బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దాకూనాయక్

సనత్‌నగర్: పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేసే చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దాకూనాయక్ హెచ్చరించారు. శానిటేషన్ సిబ్బందితో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్లవెంట చెత్తాచెదారం, వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై చెత్త, నిర్మాణ వ్యర్థాలు డంప్ చేసే వారిపై నిఘా పెట్టాలన్నారు. అలాగే జీవీపీల వద్ద చెత్తాచెదారాన్ని క్రమం తప్పకుండా తరలించాలని, సాధ్యమైనంతవరకు జీవీపీలను ఎత్తివేసే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించే ట్రాలీ ఆటోవాలాలు ప్రతిరోజూ విధులు నిర్వర్తిస్తున్నారా..? లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది వెంకటేశ్, ఎస్ఎస్ ధనాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటోన్మెంట్ బోర్డు సమావేశం

బిల్డింగ్ బైలాస్‌పై చర్చించే ఛాన్స్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుండేశ్వర్ ఆధ్వర్యంలో ఈనెల 8న (నేడు) జరగనున్నది. సీఈఓ మధుకర్‌నాయక్, బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొననున్నారు. కంటోన్మెంట్ పరిధిలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఆమోదం, టెండర్ల ఖరారు, భవన నిర్మాణ అనుమతుల మంజూరు వంటి అంశాలపై చర్చించి తీర్మానం చేయనున్నారు.

బైలాస్‌పై మరోసారి తీర్మానం

కంటోన్మెంట్ ప్రజలు పాతికేళ్లుగా ఎదురు చూస్తున్న నూతన బిల్డింగ్ బైలాస్‌కు సంబంధించిన ప్రతిపాదనలపై మరోసారి చర్చించి, తీర్మానం చేయనున్నారు. 2001లో కంటోన్మెంట్‌లో భవన నిర్మాణానికి సంబంధించి ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ) 0.5 నుంచి 1.5కు పెంచారు. అయినప్పటికీ సమీప మున్సిపాలిటీతో పోలిస్తే కంటోన్మెంట్‌లో భవన నిర్మాణాలకు సంబంధించి పలు ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ముఖ్యంగా ఆర్మీ అవసరాలకే ప్రాధాన్యమిచ్చేలా, కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారు. గరిష్ఠంగా రెండు అంతస్తుల మేర నిర్మాణాలకే అనుమతులున్నాయి. నూతన బిల్డింగ్ బైలాస్‌లో ఈ పరిమితిని పెంచే ప్రతిపాదనలు ఉండొచ్చని తెలుస్తోంది. దీంతో పాటు ఎఫ్ఎస్ఐ పరిమితిని 1.5 నుంచి మరికొంత మేరకు పెంచే అవకాశముందని సమాచారం. అయితే పాతికేళ్లుగా కంటోన్మెంట్‌లో పలుమార్లు నూతన బిల్డింగ్ బైలాస్‌కు సంబంధించి బోర్డు తీర్మానాలు చేసి పంపడం, రక్షణ శాఖ ఆమోదం పెండింగ్‌లో పెట్టడం పరిపాటిగా వస్తోంది. ఇదిలా ఉండగా, తుర్కపల్లిలోని కంటోన్మెంట్ ట్రెంచింగ్ గ్రౌండ్ ఆవరణలో ప్రతిపాదిత గోశాల ఏర్పాటుపై బోర్డులో చర్చించే అవకాశముందని తెలుస్తోంది.